
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

మంగళవారం 25 నవంబరు 2025



కోటి పరిహారం ఇంకెప్పుడు?

4 నెలలుగా సిగాచి బాధితుల ఎదురుచూపులు

రూ.26 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొన్నవైనం 7

ఐఐటీహెచ్‌లో ప్రయాస్ ప్రేరణ-2025

గ్రామీణ విద్యార్థుల అభ్యాసాన్ని బలోపేతం చేయడానికి కృషి



కంది పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న అధికారులు

కంది పీహెచ్‌సీలో నేషనల్ హెల్త్ మిషన్ బృందం తనిఖీ

ల్యాబ్ టెస్టుల నిర్వహణపై పరిశీలన

కంది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ పరీక్షల నిర్వహణ, వైద్య సేవలను సోమవారం నేషనల్ హెల్త్ మిషన్ బృందం కంది పీహెచ్‌సీలో తనిఖీలు చేసింది. జేడీ డాక్టర్ పద్మజ నేతృత్వంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిరంజన్, ఎన్‌సీడీ స్పెషలిస్ట్ డాక్టర్ కరుణశ్రీ పీహెచ్‌సీని పరిశీలించి అందుబాటులో ఉన్న మందులు, సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. రికార్డులు, హాజరు, రిజిస్టర్‌లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్ సెంటర్లను, చికిత్స విధానం, ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లో ఉన్న మందుల వివరాలు ఆరాతీశారు. పీహెచ్‌సీ సిబ్బంది పనితీరును గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజారోగ్య కార్యక్రమాలను, ఆరోగ్య కార్యక్రమాల అమలుతీరు, పురోగతిని తెలుసుకున్నారు. 108 వాహనాల పనితీరును పరిశీలించి సిబ్బందికి మెరుగైన సేవలు అందించేలా, అవసరమైతే ఇతర జిల్లాస్థాయి ఆసుపత్రులకు సిఫార్సు చేసేలా సూచనలు ఇచ్చారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశంకర్, ల్యాబ్ టెక్నీషియన్లు, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నువ్వా నేనా..!

పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు

సర్పంచ్, వార్డుసభ్యుల జాబితాల ప్రదర్శన

తెరమీదకు వస్తున్న ఆశావహులు

పల్లెల్లో మొదలైన విందులు.. ఆకర్షణలు

ఎన్నికల నోటిఫికేషన్ వైపే అందరి చూపు



గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టం పూర్తయ్యింది. ఉత్కంఠగా ఎదురుచూసిన రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. 2011లో ఎస్సీ, ఎస్టీ జనాభా, 2024లో చేపట్టిన బీసీ కులగణన ఆధారంగా రిజర్వేషన్లను తేల్చినట్లు తెలుస్తున్నది. రిజర్వేషన్ల లెక్క తేలడంతో ఆశావహులు నువ్వానేనా అన్నట్లుగా సై అంటున్నారు. ఇక ఎన్నికల నోటిఫికేషన్ వైపే అంతా ఎదురుచూస్తున్నారు.

సంగారెడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. వచ్చే నెలలోనే ఎన్నికలను నిర్వహిస్తారనే సంకేతాలు రావడంతో ఆశావహుల ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఎవరికివారే తమ అనుచరులతో కలిసి సర్పంచ్‌లుగా, వార్డుసభ్యులుగా పోటీచేయాలా.. వద్దా అంటూ అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. వివిధ సంఘాల సభ్యులు, పెద్దమనుషులు, పలుకుబడి కలిగిన వ్యక్తులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అప్పుడే విందులు, వినోదాలు సైతం మొదలయ్యాయి. తమను గెలిపిస్తే ఇదిచేస్తాం.. అది చేస్తామంటూ ఆకర్షిస్తున్నారు.

నోటిఫికేషన్‌పై ఉత్కంఠ

2024 ఫిబ్రవరిలో జరగాల్సిన పంచాయతీ ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఇటీవల రిజర్వేషన్లు ప్రకటించినా ముందుకు సాగలేదు. హైకోర్టు సూచనలతో మరోసారి వాయిదా పడ్డాయి. తాజాగా ప్రభుత్వం మళ్లీ తెరమీదకు తెచ్చింది. అధికారులు సైతం ఇటు రిజర్వేషన్ల పరంగా కసరత్తు పూర్తి చేసి కొత్త జాబితాను విడుదల చేశారు. ఇందులోనూ అసమానతలు ఉన్నాయని, మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో నోటిఫికేషన్ విడుదలవుతుందా లేదా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఆశావహుల్లో చాలామంది ధైర్యంగా ముందడుగు వేయలేకపోతున్నారు.

వార్డుసభ్యుల రిజర్వేషన్లు

	మెదక్ జిల్లా	సంగారెడ్డి జిల్లా
ఎస్టీ మహిళ	318	353
ఎస్టీ జనరల్	386	399
ఎస్సీ మహిళ	235	480
ఎస్సీ జనరల్	423	643
బీసీ మహిళ	410	464
బీసీ జనరల్	588	640
జనరల్	849	1,107
జనరల్ మహిళ	1,011	1,284
మొత్తం స్థానాలు	4,220	5,370

సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఖరారు 8

వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్ ఏర్పాటు

సంగారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు కోసం అధికారులు ఎట్టకేలకు ట్రైసైకిల్ ఏర్పాటు చేశారు. గత వారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చేందుకు వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న విషయాన్ని 'ఆంధజ్యోతి' దినపత్రికలో ఈ నెల 10న ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య వీల్‌చైర్ ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమాధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు వీల్‌చైర్ ఏర్పాటు చేశారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజావాణి హాల్ వద్దకు వీల్‌చేయిర్‌లో చేరుకున్న పట్టణవాసి



హెల్మెట్ ధరించకపోతే.. పోలీసులకైనా ఫైన్

సంగారెడ్డిలో 10 మందికి జరిమానా

సంగారెడ్డి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించని సొంత శాఖ సిబ్బందికి ట్రాఫిక్ పోలీసులు షాక్ ఇచ్చారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడుపుతున్న పది మంది పోలీసులకు ట్రాఫిక్‌పోలీసులు జరిమానా విధించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లే దారిలో సోమవారం ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సాయిలు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఉదయం జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లేవారిని ఆపి తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడుపుతున్న 10 మంది పోలీసులకు జరిమానా విధించారు. దీనిపై సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ఈ సందర్భంగా స్పందిస్తూ పోలీసులు ముందుగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇటీవల అనేకమంది పోలీసులు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల బారినపడ్డారని గుర్తుచేశారు. హెల్మెట్ తలకు మాత్రమే కాదు మొత్తం కుటుంబానికే రక్షణ ఇస్తుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి నడపొద్దని సూచించారు. అతి వేగం ఆనందాన్నిచ్చినా.. ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు ప్రమాదాలకు పాల్పడితే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మాస్ కాపీయింగ్‌కు ఇక చెక్

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

సీసీటీవీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు

కమాండ్ సెంటర్లతో అనుసంధానం

ఆదేశాలు జారీ చేసిన ఇంటర్మీడియట్ బోర్డు

మెదక్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఇక మరింత కట్టుదిట్టమైన నిఘా నీడలో జరుగనున్నాయి. మాస్ కాపీయింగ్‌కు చెక్ పెట్టేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా.. ప్రైవేటు కాలేజీల్లోనూ ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. బోర్డు కార్యదర్శి కృష్ణఅదిత్య ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు జరుగనున్నాయి.

తనిఖీ బృందాలు

గతేడాది ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలను అమర్చి ఇంటర్‌బోర్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. ఈసారి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా రంగంలోని దించన్నారు. దీంతో ప్రైవేటు కళాశాల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు పేర్కొన్నారు.



నిఘా కట్టుదిట్టం

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి ఇంటర్‌బోర్డు కంట్రోల్ కమాండ్‌కు అనుసంధానం అయి ఉన్నాయి. ఇక్కడి దృశ్యాన్ని వారు వీక్షించి పర్యవేక్షించనున్నారు. అలాగే ఒక్కో ప్రైవేటు కళాశాలలో ఐదేసి చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 4 ల్యాబ్‌లకు ఒక్కొటి చొప్పున, కారిడార్‌లో మరొకటి ఏర్పాటు చేయాలని ఆదేశాలున్నాయి. ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్‌కు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్ష ఉంటుంది. దీనిని జనవరి 21న నిర్వహించనున్నారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతోపాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. అయితే వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సైతం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు సన్నద్ధమవుతోంది. పర్యవేక్షణ కోసం డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించనున్నారు.

ప్రాక్టికల్స్‌పై నిఘా

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సీసీ నిఘాలో కొనసాగనున్నాయి. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. మెటీరియల్‌ను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతాం.

-మాధవి, మెదక్ డీఐఈవో

మెదక్ జిల్లాలో ఇలా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	16
ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు	64
ప్రైవేటు కళాశాలలు	9
ఒక్కో కళాశాలలో సీసీ కెమెరాలు	5
ప్రభుత్వ సెక్టార్ కళాశాలలు	52
ప్రథమ సంవత్సరం విద్యార్థులు	7,078
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	6,141



తెరుచుకోని తనిఖీ కార్యాలయం క్యాబిన్



అధికారులు లేకపోవడంతో చెట్ల కింద వేచి ఉన్న వాహనదారులు

ఎంవీఐ కార్యాలయం ఖాళీ!

వేడుకల్లో అధికారులు బిజీ

తెరుచుకోని తలుపులు

మెదక్ మున్సిపాలిటీ/మెదక్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు పెళ్లి ఉందంటూ కార్యాలయానికి తలుపులు మూసేసిన సంఘటన మెదక్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించిన మోటార్ వెహికిల్ జిల్లా కార్యాలయం అధికారులు పెళ్లి ఉందంటూ విధులకు ఎగనామం పెట్టారు. కార్యాలయంలో కనీసం ఒక్కరు కూడా అందుబాటులో ఉండకుండా తలుపులకు గడియవేసి చేతులు దులుపుకున్నారు. గంటన్నర పాటు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో వచ్చినవారు చేసేదేమీ లేక చెట్ల కింద కూర్చుండిపోయారు. ఒక్కరు కూడా లేకుండా ఎక్కడికి వెళ్లారని ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని నిలదీస్తే కానిస్టేబుల్ పెళ్లికి వెళ్లారంటూ సమాధానం ఇచ్చారని వాహనదారులు తెలిపారు. మధ్యాహ్నం 3:45 గంటల ప్రాంతంలో ఒకేఒక అధికారి వచ్చి వాహనాదరులకు సమాధానమివ్వడం కనిపించింది. ఈ సందర్భంగా వాహనదారులు తమ బాధలు చెప్పుకున్నారు. పేరు మార్చడం కోసం ఐదు నెలలుగా తిరుగుతున్నానని జాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన ఆవుల అనిల్ తెలిపారు. పశువులకాపరినైన తాను కష్టపడి బైక్ కొంటే పేరు మార్పు కోసం ఐదు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనం పత్రాల్లో తప్పులు ఉన్నందున డీడీ చెల్లించి మార్పు చేయాలని అధికారి ఇచ్చానన్నారు. ఐదు నెలలుగా ప్రదక్షిణలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. డీడీఫీజు, వచ్చిపోవడానికి ఖర్చులతో పాటు పని త్వరగా కావాలని దళారులకు చెల్లించిన మొత్తం కలిపి రూ. వేలల్లో ఖర్చు చేశానని ఆరోపించారు.



అమీన్‌పూర్‌లో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

డ్రగ్స్‌ను అరికట్టడంలో ఎక్సైజ్‌శాఖ పాత్ర కీలకం

అమీన్‌పూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలను అరికట్టడంలో ఎక్సైజ్‌శాఖ పాత్ర కీలకమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో కొత్త ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గం ఉపాధి కోసం వచ్చే ప్రజలతో వైవిధ్యంగా ఉండటంతో గంజాయి, మత్తుపాదార్థాలను విక్రయించే ప్రమాదం ఉందన్నారు. వాటిని నివారించడానికి ఎక్సైజ్‌శాఖకు ప్రతీ పౌరుడు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఈర్లదేవానంద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, ఎక్సైజ్ జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవుసులకుంట కట్ట తొలగింపుపై ఫిర్యాదు

కళ్లు తెరిచిన అధికారులు

తూప్రాన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయ మార్గంలో ఉన్న అవుసుల కుంట కట్ట తొలగింపుపై అధికారులు స్పందించారు. కట్టను తొలగించి రోడ్డేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అవుసుల కుంట తొలగింపు పనులపై ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో 'అవుసుల కుంటకు ఎసరు' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అప్పట్లో అధికారులు స్పందించకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోయారు. అధికారులు ఏ చర్యలు తీసుకోకపోవడంతో రెచ్చిపోయి కట్టను మధ్యలో నుంచి తొలగించి ఏకంగా రోడ్డే వేశారు. కంగుతిన్న అధికారులు సోమవారం అవుసుల కుంటను పరిశీలించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ అవుసుల కుంటను పరిశీలించి కట్టను తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు చేశారా అని ఆరా తీశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ అనురాధ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



తూప్రాన్‌లో తొలగించిన అవుసుల కుంటను పరిశీలిస్తున్న అధికారులు

పత్తి చేనులో మేతకు వదిలిన 16 మేకలు మృతి



మొలకలపాడులో మృతి చెందిన మేకలు

న్యాల్‌కల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి చేనులో మేతకు వదిలిన మేకలు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మొలకలపాడు గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన మేతరి సంజీవ్ తన మేకలను పత్తి చేనులో మేతకు వదిలాడు. కొంతసేపు మేత తిన్న తరువాత మేకలు ఒక్కొక్కటి మృత్యువాతపడ్డాయి. వీటి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

కరెంటు తీగలు తగిలి వరి కోత మిషన్ దగ్ధం



బొంతపల్లిలో దగ్ధమవుతున్న వరి కోత మిషన్

గుమ్మడిదల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో వరి కోత యంత్రం దగ్ధమైన ఘటన సోమవారం బొంతపల్లి గ్రామంలో జరిగింది. గ్రామంలోని అయ్యప్ప ఆలయ సమీపంలో రైతు కిష్టయ్యకు చెందిన పొలంలో వరి కోత మిషన్‌తో కోతలు కొనసాగిస్తుండగా కరెంటు తీగలను తాకింది. దీంతో నిప్పురవ్వలు ఎగిసిపడి కోత మిషన్‌కు మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన డ్రైవర్ కిందకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. చూస్తుండగానే హార్వెస్టర్ పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. సమీపంలోని పరిశ్రమల నుంచి ఫైరింజన్లను రప్పించి మంటలను అదుపు చేయడంతో వరి పంటకు నష్టం తప్పింది. వేలాడుతున్న విద్యుత్ తీగలు వేలాడుతున్నా విద్యుత్‌శాఖ సిబ్బంది సరి చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

గంజాయి రవాణా కేసులో దోషికి పదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా రవాణా చేసిన కేసులో దోషికి పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.జయంతి సోమవారం తీర్పు చెప్పారు. పోలీసులు వివరాల ప్రకారం... ఛత్తీస్‌గడ్ రాష్ట్రం అనపారా కంకర్‌కు చెందిన లలిత్‌కుమార్(34) 2019లో 111 కిలోల ఎండు గంజాయి రవాణా చేస్తుండగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో లలిత్‌కుమార్‌కు పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

మంజీరా నుంచి ఇసుక తరలింపు

ట్రాక్టర్లు, ఇసుక నిల్వల సీజ్

పుల్‌కల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి వద్ద మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యాజమానులు మంజీరా నది నుంచి నాలుగైదు రోజులుగా కూలీల సహాయంతో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న గిర్దావర్ ప్రమోద్‌కుమార్ సోమవారం తనిఖీలు నిర్వహించి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. డ్రైవర్ పరారుకావడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నది ఒడ్డున ఇసుక నిల్వలను తహసీల్దార్ నామాల కిష్టయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పరిశీలించి ఇసుక నిల్వలను సీజ్ చేశారు. మూడు రోజుల్లో ఇసుకను వేలం వేస్తామని తహసీల్దార్ తెలిపారు.



సరాఫ్‌పల్లి వద్ద మంజీరా నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

కారు, ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కారు ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన గజ్వేల్ మండలంలోని జాలిగామ గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాల మల్లేశం లక్ష్మి, ప్రజ్ఞాపూర్‌కు చెందిన పోచవ్వ, ముగ్గురు రాయపోల్ మండలం టెంకంపేట నుంచి ఆటోలో గజ్వేల్‌కు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో జాలిగామ గ్రామం వద్ద కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు.

కుంటలో పడి ఒకరి మృతి



హర్షదుద్దీన్(ఫైల్)

చేగుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన చేగుంట మండలం మక్కరాజుపేటలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ-2 బిక్యనాయక్ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా భరత్‌నగర్‌కు చెందిన మహమ్మద్ హర్షదుద్దీన్(40) అత్తగారిల్లయిన మక్కరాజుపేటలో ఉంటూ పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి కాలకృత్యాలకు వెళ్లి చాన్కాన్ కుంటలో కాలుజారిపడి మృతిచెందాడు. మృతుడికి భార్య తాహెరాబేగం, కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. హర్షదుద్దీన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అదృశ్యమైన పాత నేరస్థుడి మృతి



రాజాసింగ్(ఫైల్)

పటాన్‌చెరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమయిన పాత నేరస్థుడు కుంటలో శవమై తేలిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్టలో నివసించే రాజాసింగ్ (30) కనిపించడం లేదని 20వ తేదీన అతడి సోదరుడు గోపీసింగ్ జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి ఒంటి గంట సమయంలో రాజాసింగ్ కారు నడుపుకుంటూ ఐడీఏబొల్లారం వద్ద ఔటర్ రింగురోడ్డు సర్వీస్ రహదారి మీదుగా పట్టణంలోకి వచ్చారు. పెట్రోలింగ్ పోలీసులు అనుమానంతో కారును అడ్డుకోవడంతో రాజాసింగ్ పరారయ్యాడు. సీఐ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కారును తనిఖీ చేయగా కత్తులు దొరికాయి. పారిపోయిన రాజాసింగ్ కోసం స్థానికుల సహాయంతో పోలీసులు తెల్లవారేవరకు వెతికారు. కానీ, మాధవానికుంట మీదుగా చెట్ల పొదల్లోంచి పారిపోయాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం మాధవానికుంటలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి ఆన్‌లైన్‌లో ఫొటోలు ఉంచారు. ఈ ఫొటోలు చూసిన జగద్గిరిగుట్ట పోలీసులు మృతుడిని కనిపించకుండాపోయిన రాజాసింగ్‌గా గుర్తించారు. మృతుడిపై జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, కూకట్‌పల్లి, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 20 దొంగతనం కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

ముస్త్యాలలో పట్టపగలే చోరీ

వృద్ధురాలి మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు అపహరణ



బైక్‌పై పరారవుతున్న అనుమానితుడు

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం పట్టపగలే ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారుగొలుసు అపహరించుకుపోయిన సంఘటన కలకలం రేపింది. గ్రామ శివారులోని కాలనీకి చెందిన సొంటె నర్సమ్మ కుటుంబ సభ్యులు ఇంట్లో ఎవరు లేకపోవడంతో మధ్యాహ్నం ఇంటి ఆవరణలో ఒంటరిగా కూర్చుంది. హెల్మెట్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి గమనించి తెలిసిన వారిలా మాట్లాడించేందుకు ప్రయత్నించి నర్సవ్వ మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల గొలుసును లాగేసుకుని బైక్‌పై పరారయ్యాడు. నర్సవ్వ బోరున విలపించడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో దర్యాప్తు చేపట్టారు. సమీపంలో ఓ సీసీ కెమెరా పుటేజీని పరిశీలించగా, గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై మద్దూరు వైపుకు ఉడాయించడాన్ని గుర్తించారు. చోరీ ఘటనలో రూ.4.50లక్షల నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా, ఇటీవల మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో మహిళ మెడలో నుంచి బంగారు ఆభరణం అపహరించిన సంఘటన మరువకముందే ముస్త్యాలలో పట్టపగలే అపహరణ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కోటి పరిహారం ఇంకెప్పుడు?

- 4 నెలలుగా సిగాచి బాధితుల ఎదురుచూపులు
- రూ.26 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొన్న వైనం
- సీఎం సమాధానం చెప్పాలంటున్న ప్రజాసంఘాలు
- పరిశ్రమ నిర్లక్ష్యమే 54 మంది ప్రాణాలను బలిగొంది
- హైకోర్టు మొట్టికాయ వేసినా యజమాన్యంలో చలనం లేదు
- ఈ కేసులో తదుపరి విచారణ ఈనెల 27న



సిగాచి పరిశ్రమ

పూర్తి పరిహారం ఇప్పించాలి



సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో నా భర్త నాగేశ్వరావు చనిపోవడంతో మా కుటుంబం సమస్యల్లో పడింది. ఇస్తానన్న పరిహారం కోసం చెప్పులరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది ప్రజా సంఘాలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వంలో కదలిక వస్తేనే మాకు నష్టపరిహారం లభిస్తుందని అనుకుంటున్నాం.

- సిగాచి మృతుడు నాగేశ్వరరావు భార్య సులోచన

పటాన్‌చెరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో 54 మంది మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇస్తానన్న యాజమాన్యం మాట కలగానే మారింది. సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాదం జరిగిన తర్వాత పరిశ్రమ వద్ద మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తలా రూ. కోటి పరిహారం అందించే ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారు. సీఎం హామీ ఇచ్చి నాలుగు నెలలు పూర్తయినా యాజమాన్యం ఇంకా నెరవేర్చలేదు. ఇప్పటివరకు యజమాన్యం ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున చెల్లించగా, ప్రభుత్వం తరపున రూ.లక్ష అందింది. యాజమాన్యం ఇంకా రూ.75 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం నుంచి కూడా బాధిత కుటుంబాలకు ఎటువంటి సమాధానం లభించడం లేదు. పౌర సంఘాలు కూడా బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలని పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. సిగాచి ప్రమాదంలో 46 మంది మృతి చెందగా, ఎనిమిది మంది గల్లంతయ్యారు. 28 మంది గాయపడగా వారంతా అస్పత్రుల నుంచి ఇంటికొచ్చినా రకరకాల ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు.

192 మంది సాక్షుల విచారణ

సిగాచి పరిశ్రమపై న్యాయపోరాటం చేయడానికి రిటైర్డ్ సైంటిస్ట్ కలపాల బాబురావు హైకోర్టును ఆశ్రయించగా, ఈ కేసును న్యాయవాది వసుధ నాగరాజు వాదిస్తున్నారు. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, న్యాయమూర్తి జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సిగాచి పారిశ్రామిక అగ్నిప్రమాదంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. దర్యాప్తు కొనసాగుతోందని, ప్రస్తుతం పోలీసులు 192మంది సాక్షులను విచారిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది చెప్పటంతో, సీఆర్‌పీసీ సెక్షన్ 161 ప్రకారం సాక్షుల వాంగ్మూలాలు పూర్తయ్యాకే అరెస్టు చేయాలనే నియమం ఎక్కడుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించటం గమనార్హం. ఈ కేసు ఈనెల 27వ తేదీన హైకోర్టులో తదుపరి విచారణ జరిగింది. కాగా సిగాచి యాజమాన్యం నిర్లక్ష్యపూరిత వైఖరి వల్లే ఘోర దుర్ఘటన చోటు చేసుకుందని సాంకేతిక నిపుణుల కమిటీ సైతం స్పష్టం చేసింది. మైక్రో క్రిస్టల్ సెల్యూలోజ్ ధూళికి అధికంగా మండే స్వభావం ఉందని తెలిసినా నిర్లక్ష్యం వహించటం, ప్రొడక్షన్ యూనిట్ మీద మొదటి అంతస్తులో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్‌మెంట్ ల్యాబ్ ఏర్పాటు చేయటంతో పాటు, సేఫ్టీ నిబంధనలు పెడచెవిన పెట్టటం, మిషనరీ మార్చకుండానే క్వాలిటీ పెంపుదల, అనుమతులకు మించి విద్యుత్తు వినియోగం, ఉత్పత్తి పెంచినా, అందుకు తగినట్లుగా కనీస విస్తరణ చేయకపోవడం, ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినా ఆర్పే వ్యవస్థ నామమాత్రంగానే ఉండటం, ఇరుకైన స్థలంలో నిర్మాణాల కారణంగా ప్రమాద తీవ్రత పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులూ తమ విధులు సరిగా నిర్వర్తించలేదని ప్రభుత్వానికి అందించిన నివేదికలో సాంకేతిక నిపుణుల కమిటీ పేర్కొంది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి

- మూడు నెలల క్రితమే వివాహం
- భర్తతో కలిసి వెళ్తుండగా ఢీ కొన్న ట్రాక్టర్



ప్రణవి

మిరుదొడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ అదుపు తప్పి బైక్‌ను ఢీ కొనడంతో నవ వధువు మృతి చెందింది. భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా, ఈ ఘటన జరిగింది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం చెప్యాల శివారులో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు.. సిద్దిపేటకు చెందిన సాయికిరణ్, ప్రణతిలకు మూడు నెలల క్రితమే వివాహమైంది. ఉద్యోగ నిమిత్తం వారు సోమవారం సిద్దిపేట నుంచి సంగారెడ్డికి ద్విచక్రవాహనంపై బయలు దేరారు. వీరు మండలంలోని చెప్యాల శివారుకు చేరుకోగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ అదుపుతప్పి బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరికీ గాయాలు అయ్యాయి. వెనుకే వస్తున్న 108 వాహనంలో భార్యభర్తలిద్దరిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో ప్రణతి మృతి చెందింది. సాయికిరణ్ చికిత్స పొందుతున్నాడు.

భార్యతో గొడవపడి వ్యక్తి బలవన్మరణం



బాలేష్(ఫైల్)

రామాయంపేట,నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): అప్పుల పాలైన వ్యక్తి భార్యతో గొడవ పడి మనస్తాపంతో ఉరేసుకుని బలవన్మరణం చెందిన ఘటన సోమవారం రామాయంపేట మండల పరిధి ధర్మారంలో చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన లింగరమైన బాలేష్(34) ఐదేళ్ల క్రితం కనకలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వారికి ఒక సంవత్సరం బాబు ఉన్నాడు. కాగా బాలేష్ కొద్ది రోజులుగా ఏ పని చేయకుండా దొరికిన చోటల్లా అప్పు చేశాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య సోమవారం మధ్యాహ్నం గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలేష్ ఇంట్లో నుంచి వెళ్లి పోయి తండ్రికి ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలిస్తుండగా గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతున్న బాలేష్ మృతదేహం కనిపించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



శివ(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పంతులపల్లి గ్రామానికి చెందిన మున్నూరు రాములు, వీరమణిల కుమారుడు శివ(23) కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో ఉంటూ ఓ కంపెనీలో పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో గత అక్టోబరు 21న శివ రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి శివ మృతి చెందాడు. ఉన్న ఒక్క కుమారుడి మృతితో తల్లి దండ్రులు భోరున విలపించారు. శివ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

స్కూల్ బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న యువకులు

జహీరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రావుస్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సులో సోమవారం సాయంత్రం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విద్యార్థులతో వెళ్తున్న బస్సులో పొగలు రాగా, గమనించిన డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి వివరాలు.. పట్టణంలోని రావుస్ పాఠశాలకు చెందిన బస్సు 39 మంది విద్యార్థులతో మహీంద్రా కాలనీకి వెళ్తోంది. ఈ క్రమంలో పాత ఆర్టీఏ చెక్‌పోస్టు వద్దకు రాగానే బస్సు బ్యాటరీ నుంచి పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు నిలిపి విద్యార్థులను కిందికి దింపారు. అప్పటికే బస్సుకు చిన్నగా మంటలు అంటుకోవడంతో అటుగా వెళ్తున్న యువులు మంటలను ఆర్పివేశారు. దీంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది.

హల్దీ వాగులోకి దూసుకెళ్లిన కంటైనర్

- ఇరువురికి స్వల్ప గాయాలు

తూప్రాన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హైవేపై వెళ్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి హల్దీవాగులోకి దూసుకెళ్లగా వాగులోపల చెట్టు అడ్డుపడడంతో అక్కడే ఆగిపోయింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. తూప్రాన్ పట్టణ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. నాగ్‌పూర్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కంటైనర్ లారీ సోమవారం తూప్రాన్ పట్టణ పరిధి హల్దీవాగు బ్రిడ్జి వద్దకు రాగానే అదుపు తప్పి హల్దీవాగులో దూసుకెళ్లింది. వాగులో చెట్లు అడ్డుగా ఉండటంతో మధ్యలోనే నిలిచిపోయింది. కంటైనర్ లారీ డ్రైవర్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన విమల్ యాదవ్, క్లీనర్ వికాస్ యాదవ్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తృటిలో ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఎండు గంజాయి పట్టివేత



పట్టుబడిన ఎండు గంజాయి

మునిపల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా ఎండు గంజాయి పట్టుబడింది. బీదర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ స్కూటీని అనుమానంతో తనిఖీ చేయగా అందులో 115గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. నిందితులు హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన దేవరకొండ నాని, పల్లి సాయి పవన్‌లను పోలీసులు విచారించగా బీదర్‌లోని ఇరానీ గల్లీలో తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వారు అంగీకరించారు. పట్టుబడిన ఎండు గంజాయితో పాటు ఒక స్కూటీ, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొన్నట్టు ఎస్ఐ తెలిపారు. నిందితులైన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. వాహన తనిఖీల్లో కానిస్టేబుళ్ల హనీఫ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ జట్ల ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జుబ్లీ క్లబ్‌లోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ జట్ల ఎంపికలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్‌లో పాల్గొనే ఆరు జట్ల ఎంపికలు సంగారెడ్డి, సిద్దిపేటలో జరిగాయని మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలో నాలుగు జట్లకు 60 మందిని ఎంపిక చేయగా, సిద్దిపేటలో రెండు జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. ఈ ఆరు జట్ల మధ్య లీగ్ పోటీలు ఈ నెల 27 నుంచి ప్రారంభంకానున్నాయని పేర్కొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ ఎంపికల్లో అసోసియేషన్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, కోచ్ శ్రీనాథ్‌రెడ్డి, కలీం, తోహీద్, చంద్రమౌళి, ఇనాం తదితరులు పాల్గొన్నారు.

161 హైవేపై సేఫ్టీ నిబంధనలు ఏర్పాటు : పీడీ



ఎంపీకి జీవో కాపీలు అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

పెద్దశంకరంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 161వ జాతీయ ప్రధాన రహదారిపై జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ సూచనల మేరకు సేఫ్టీ నిబంధనలను డిసెంబరు నెలాఖరులోగా ఏర్పాటు చేయనున్నట్లు నేషనల్ హైవే పీడీ మాధవి సోమవారం తెలిపారు. ఇటీవల ఎంపీ నేషనల్ హైవే అథారిటీకి ప్రమాదాల నివారణకు పలు సూచనలిచ్చారు. దీంతో అధికారులు స్పందించి 161వ జాతీయ ప్రధాన రహదారిపై సోలార్ బ్లింకర్లు, ఎంబీసీబీలు, మెయిన్ రోడ్డులో రబ్బర్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయనున్నట్లు పీడీ తెలిపారు. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ నుంచి వచ్చిన జీవో కాపీలను ఎంపీకి చూయించారు.

యూనిటీ మార్చ్‌కు ఖేడ్ యువకులు



పవన్‌రాథోడ్, సాయిముదిరాజ్

నారాయణఖేడ్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఏడాది పాటు ఉత్సవాలు ఈనెల 23 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నది. ఈ యూనిటీ మార్చ్‌కు నారాయణఖేడ్‌కు చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ, మండల అధ్యక్షుడు సిందోల్ దశరత్ తెలిపారు. నారాయణఖేడ్ మండలం గుండ తండాకు చెందిన పవన్‌రాథోడ్, మాద్వార్‌కు చెందిన సాయి యూనిటీ మార్చ్‌కు ఎంపిక కావడంతో, వారికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి గుజరాత్‌కు జిల్లా నుంచి వెళ్తున్న యువకుల బృందంకు పంపించిందన్నారు.

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమం



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామని, ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలు అని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక నాయకులు అన్నారు. సోమవారం సిద్దిపేటలో ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే ఇటువంటి హత్యా కార్యక్రమాలు చేపట్టారని విమర్శించారు. అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని, అది చేయకుండా అడవులను విధ్వంసం చేస్తూ ఆక్సిజన్ లభించకుండా చేస్తున్నారని అన్నారు. అడవులను రక్షించే ఆదివాసి బిడ్డలను ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేస్తున్నారని ఆరోపించారు. ఈ హత్యలపై మానవహక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, ప్రభాకర్, విష్ణు, రాజేష్, శేఖర్, రాజు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో ప్రయాస్ ప్రేరణ-2025

- గ్రామీణ విద్యార్థుల అభ్యాసాన్ని బలోపేతం చేయడానికి కృషి
- ఐఐటీహెచ్‌లోని ఆర్‌డీసీ సహకారం



ఐఐటీహెచ్‌లో ప్రయాస్ ప్రేరణ కార్యక్రమంలో గ్రామీణ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐఐటీహెచ్ ఆర్‌డీసీ బృందం

కంది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థుల అభ్యాసాన్ని బలోపేతం చేయడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ లోని ఆర్‌డీసీ (రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్) ఆధ్వర్యంలో ప్రయాస్ 'ప్రేరణ-2025' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించింది. ఐఐటీహెచ్ విద్యార్థుల నేతృత్వంలోని అవుట్ రీచ్ గ్రూప్ ప్రయాస్‌తో కలిసి గ్రామీణ పాఠశాల విద్యార్థుల్లో విశ్వాసం, అవగాహనతో పాటు వారికి ఓ ఆశయాన్ని కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కంది, ఇంద్రకరణ్, చేర్యాల, ఓడీఎఫ్, ఎద్దుమైలారం, కలివేముల గ్రామాల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మెంటర్‌షిప్, సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ గణితంపై లెర్నింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జనరల్ నాలెడ్జి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్, ప్రయాస్ విద్యార్థి బృందం అంకిత భావంతో గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మహాత్మాగాంధీజీ చెప్పినట్లుగా భారతదేశ ఆత్మ గ్రామాలలో నివసిస్తుందన్నారు.

బ్రాహ్మణ సమాజాన్ని కించపరిచే వారిని ఉరి తీయాలి



సంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినానంతరం మాట్లాడుతున్న వేదపండితుడు వరదచార్యులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దైవ సేవలో ఉన్న బ్రాహ్మణులు, బ్రాహ్మణ సమాజాన్ని కించపరుస్తూ అసభ్యకరంగా పాట పాడిన జీడి సారయ్యను బహిరంగంగా ఉరితీయాలని వేద పండితులు వరదచార్యులు అన్నారు. జీడి సారయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజాన్ని హేయంగా చూపిస్తూ కుల ద్వేషాలను రెచ్చగొట్టేలా పాటపాడడం చట్టపరంగా శిక్షార్హమైనదన్నారు. ఇలాంటి పాటలు, వ్యాఖ్యల వల్ల కుల విరోధాలను పెంచే ప్రమాదం ఉన్నదని, సామాజిక శాంతి సామరస్యాన్ని భంగం చేసేలా ఉన్నాయన్నారు. ప్రశాంతంగా ఉన్న సమాజంలో అశాంతి, అలజడిని సృష్టిస్తాయన్నారు. తమ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని భగవంతుడి సేవలో ఉన్న తమకు ఆగ్రహం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. సారయ్యపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇంకెవ్వరు కూడా ఇలాంటి వ్యాఖ్యలు గాని పాటలు కాని కార్యక్రమాలను నిషేదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిశంకర్‌కుమార్, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు శిరీష, రజనీ, బీజేపి నాయకులు కొండాపురం జగన్, ద్వారకా రవి, పవన్‌కుమార్‌గౌడ్, కసిని వాసు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా అత్యుత్తమ సేవలు : డీజీఎం

- ఉమ్మడి జిల్లాలో రూ.2,200 కోట్ల రుణాలు



స్వర్ణనిధి డిపాజిట్ స్కీమ్ కరపత్రాలు ఖాతాదారులతో కలిసి ఆవిష్కరిస్తున్న డీజీఎం చంద్రశేఖర్

నారాయణఖేడ్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా అత్యుత్తమ సేవలతోపాటు అన్ని కమర్షియల్ బ్యాంకులంటే అధిక వడ్డీని అందిస్తున్నామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఖేడ్‌లోని డీసీసీబీ బ్రాంచిని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో స్వర్ణనిధి డిపాజిట్ స్కీమ్‌కు సంబంధించి కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తమ బ్యాంకు ఖాతాదారులకు ఏటీఎం సదుపాయాలు కల్పిస్తూ డెబిట్‌కార్డులు అందిస్తున్నామని, ఫోన్‌పే, గూగుల్‌పే తదితర అన్ని సదుపాయాలు పొందవచ్చని అన్నారు. కొత్త ఖాతాదారులకు 10 నిమిషాల్లోనే ఖాతా తెరిచి ఇస్తామన్నారు. ఈ నెలాఖరు తేదీతో స్వర్ణనిధి 444 రోజుల ఫిక్స్ డిపాజిట్ నూతన పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. ఇందులో డిపాజిట్ చేస్తే 7.75 శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 8.25 శాతం వడ్డీ అందజేస్తామన్నారు. డిపాజిట్ చేసిన వారికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో డీసీసీబీ ద్వారా రూ.2200 కోట్ల రుణాలు అందజేశామని, రీకవరీ పరిస్థితి కూడా బాగా ఉందని డీజీఎం చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో బ్రాంచి మేనేజర్ జాదవ్‌కిషన్, రికవరీ అధికారి రవీందర్, పీఏసీఎస్ ఛైర్మన్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

తూప్రాన్‌లో మూతపడిన మైక్రో ఫైనాన్స్

- ఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులతో మహిళ మృతి ఆరోపణలు



మూతపడిన మైక్రో ఫైనాన్స్ సంస్థ కార్యాలయం

తూప్రాన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని మైక్రో ఫైనాన్స్ సంస్థ సోమవారం మూత పడింది. ఆదివారం తూప్రాన్‌కు చెందిన వరలక్ష్మి(35) మైక్రో ఫైనాన్స్ వేధింపులతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మహిళ ఆత్మహత్యకు కారణంగా పేర్కొంటున్న క్రిస్ మైక్రో ఫైనాన్స్ సంస్థ సోమవారం ఉదయం నుంచి మూసివేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు కార్యకలాపాలు నిర్వహించే క్రిస్‌మైక్రో ఫైనాన్స్ సంస్థ మూసి ఉండటం చర్చనీయాంశంగా మారింది. రికవరీ ఏజెంట్లు వేధించడంతోనే మనస్తాపానికి గురై వరలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు.

రంగనాయక్‌సాగర్ పైపుల అపహరణ

- 11 మంది నిందితుల అరెస్ట్

సిద్దిపేట క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగనాయకసాగర్ కాలువకు సంబంధించిన ఎనిమిది పైపులు చోరీకి గురయ్యాయి. మెగా కంపెనీ యార్డులో దాచి ఉంచిన ఇనుప పైపులను క్రేన్లు, లారీలను ఉపయోగించి చోరీచేశారు. కంపెనీ క్రంటాక్టర్లుగా పనిచేసిన వారు మరికొందరితో కలిసి విడతల వారీగా పైప్‌లను కట్‌చేసి తరలించారు. ఈ కేసులో 11 మంది నిందితులను సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి వెల్లడించారు. గాడిచెర్లపల్లి శివారులోని మెగా కంపనీ యార్డులో రంగనాయక్‌సాగర్ కాలువకు సంబంధించిన ఎనిమిది పైపులు చోరీకి గురైనట్లు కంపెనీకి చెందిన బి. సాగర్ ఈనెల 18న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీపీ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏసీపీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా బీహార్‌కు చెందిన రోహిత్ తంతి, చాలమల్ల వెంకట్‌రెడ్డి, ములుగు సాయికుమార్, కాకి శ్రీనివాస్, లియాఖత్, వాజిద్, నేరెళ్ల శ్రీకాంత్, ముంగిస్పల్లీ, పొన్నాల రమేష్, పొన్నాల సతీష్, పవన్‌లను అరెస్ట్ చేశారు. కంపెనీలో పెయింటింగ్ కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డి, అదే కంపెనీలో వెల్డింగ్ కంట్రాక్టర్ రోహిత్‌తంతిలకు కంపెనీలో పైపులు ఎక్కడ ఉంటాయో తెలుసు. గతంలోనూ వీరు కంపెనీలో పైపులు దొంగలించారు. ఈ క్రమంలో ఎనిమిది పైపులు దొంగలించాలని పథకం వేసి, సిద్దిపేటకు చెందిన స్క్రాప్ దుకాణ యజమాని కాకి శ్రీనివాస్‌ను సంప్రదించి పైపులు తీసుకువస్తే అమ్మిపెట్టమని ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత ఇదే కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన ములుగు సాయి సహకారంతో అక్టోబరు 26, 27 నవంబరు 11 తేదీల్లో విడతలవారీగా పైపులను కట్‌చేసి క్రేన్లు, లారీల్లో తీసుకెళ్లారు. వాటిని శ్రీనివాస్‌కు అప్పగించగా, అతను మెదక్ జిల్లా మనోహరాబాద్, శంకరంపేటల్లోని ఐరన్ కంపెనీలకు విక్రయించాడు. వచ్చిన డబ్బులను నలుగురు పంచుకున్నారు. నిందితుల నుంచి రూ.40 లక్షల విలువైన 60 టన్నుల ఇనుము, రూ.3.95 లక్షల నగదు, రెండు క్రేన్లు, బొలేరో వాహనం, నాలుగు గ్యాస్ కట్టింగ్ మిషన్లు, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన సొత్తు కొనుగోలు చేసిన వారినీ అరెస్ట్ చేశారు.

జాతీయ జంబూరి ప్రదర్శనకు విద్యార్థులు

పాపన్నపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29 వరకు ఉత్తరప్రదేశ్ లక్నోలో నిర్వహించే 19వ జాతీయ జంబూరి ప్రదర్శనలో పాపన్నపేట మండలం యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, స్కౌట్ మాస్టర్ రాజేందర్, పాఠశాల నుంచి ఏడుగురు స్కౌట్ దీక్షా విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. సోమవారం తమ ప్రదర్శన చేశారు.

బీసీ రిజర్వేషన్ల జీవో ప్రతులు దహనం

సంగారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై తీసుకువచ్చిన జీవో 46 ప్రతులను సోమవారం సంగారెడ్డిలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ప్రభుగౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో ఆర్డినేటర్ వై.అశోక్ కుమార్, వర్కింగ్ చైర్మన్ కృష్ణ, నాయకులు శ్రీధర్ మహేంద్ర, మల్లికార్జున్‌పాటిల్, లక్ష్మి, మంగగౌడ్, వీరమణి, నాగరాణి, శృతిగౌడ్ పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టండి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి రద్దవుతుందని భావించిన ప్రజలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా రావడంతో కలెక్టరేట్ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఇదిలా ఉండగా ప్రజావాణికి 76 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూముల వ్యవహారంపై విచారణ జరపాలి

పటాన్‌చెరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రేశం పురపాలక పరిధి పెద్దకంజర్ల భూముల వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సత్వరం పరిష్కరించడమే పోలీసు శాఖ ధ్యేయమని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన వినతిపత్రాలను స్వీకరించి మాట్లాడారు. తమ సమస్యలపై ప్రజలు పోలీసులకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు.

పోలీసు ప్రజావాణికి 12 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారితో మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

పీఏసీఎస్ అక్రమాలపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

చిన్నశంకరంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం రైతులకు తెలియకుండానే సొసైటీ చైర్మన్ సత్యనారాయణ రుణాల విడుదల, రుణాల అక్రమాలపై ధర్పల్లి, చందంపేట, సూరారం గ్రామాల రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం జిల్లా విచారణ అధికారి తుకారాం విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించామని, విచారణ అనంతరం సీఈవో పాషా, సొసైటీ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

చేగుంట సొసైటీ చైర్మన్‌గా బాగులు

చేగుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చేగుంట వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా బోనగిరి బాగులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గతంలో చైర్మన్ పదవిలో కొనసాగిన వారందరికీ మళ్లీ చైర్మన్ పదవులు కొనసాగే విధంగా ఉత్తర్వులు జారీ చేయడంతో బోనగిరి బాగులు మరోసారి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఈవో సందీప్ బాగులుకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాగులుకు నియామకపత్రం అందజేస్తున్న సీఈవో సందీప్

పిస్టల్ పోటీల్లో గురుకుల విద్యార్థుల సత్తా

తూప్రాన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులు పిస్టల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుహాసిని తెలిపారు. సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని ఎస్‌వీబీవీఎస్ కళాశాల ఆవరణలో ఆదివారం రాష్ట్రస్థాయి 9వ జూనియర్ పిస్టల్ పోటీలు జరిగినట్లు తెలిపారు. ఇందులో విద్యార్థులు వినోద్, రాకేష్ ప్రతిభకనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. డిసెంబరులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ రమేష్, పీడీ బాలేశ్ నవీన్‌లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో..

నారాయణఖేడ్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ కుస్తీ పోటీల్లో ఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల విద్యార్థులు సత్తాచాటారు. శని, ఆదివారాల్లో హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీ మైదానంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు చాంద్ నబీ సిల్వర్ మెడల్, ఇర్ఫాన్, రహేమాన్ బ్రాంజ్ మెడల్స్‌ను సాధించి సత్తాచాటారని ప్రిన్సిపాల్ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు గురుకుల సమన్వయకర్త జాకీర్, సంజీవ్‌నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు జీక్, సంతోష్ అభినందించి, శాలువాలతో సన్మానించారు.



కుస్తీ పోటీల్లో సత్తాచాటిన ఖేడ్ మైనార్టీ గురుకుల విద్యార్థులు

బోరు.. హైమాస్ట్ లైట్లు ప్రారంభం



పవర్‌బోర్ ప్రారంభించి నీటిని విడుదల చేస్తున్న రాయిపాడ్ రమేష్, మునిపల్లి సత్యనారాయణ

సదాశివపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఓబీసీ సెల్ సంగారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడు, 14వ వార్డు మాజీ కౌన్సిలర్ రాయిపాడ్ రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ పట్టణంలోని 14వ వార్డులో రూ.3 లక్షలు, రూ.5 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన పవర్ బోర్లు, హైమాస్ట్ లైటింగ్ సిస్టమ్‌లను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. 14వ వార్డులో త్వరలో రూ.50 లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సహకారంతో పట్టణాభివృద్ధికి కోట్లాది నిధులు మంజూరు కావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడీల నరేందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మంతూరి అనిల్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జయశ్రీ, రుక్మిణి, కృష్ణ, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

గుమ్మడిదల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బొంతపల్లి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో రూ.12 కోట్లతో నిర్మించబోయే 150 అడుగుల రాజగోపురం ఫుట్టింగ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వీరభద్రస్వామి ఆలయానికి ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు వస్తున్నారన్నారు. దశలవారీగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆలయ పాలక మండలి చైర్మన్ వద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్‌గుప్తా పాల్గొన్నారు.



రాజగోపురం ఫుట్టింగ్ పనులను శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

30 రోజుల్లో ఆస్పత్రి సేవలు

పటాన్‌చెరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రానున్న 30 రోజుల్లో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. వైద్య పరీక్షల చేయడానికి కావాల్సిన పరికరాలు కొనుగోలు చేయడానికి రూ.23.56 కోట్లు వెచ్చిస్తున్నామని అన్నారు. ఇప్పటికే రూ.187 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు షరీఫ్, దేవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, కంకరశ్రీను తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో ఎమ్మెల్యే తనిఖీ

● పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై ఆగ్రహం



గిరిజన బాలికల పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు అందించే ఆహారం సరుకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని గిరిజన బాలికల పాఠశాల/కళాశాలలను నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనం అందిస్తున్న తీరును, విద్యాబోధన గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొందరు సిబ్బంది ఆహార వస్తువులను గురుకులంలో దించనీయకుండా వాహనంలోనే ఉంచి బయట విక్రయిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇలాంటి పద్ధతి మానుకోవాలని ప్రిన్సిపాల్ ప్రియాంక, వైస్ ప్రిన్సిపాల్ మాధురిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయిన సమక్షంలోనే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. అనంతరం సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సమయంలో ఆస్పత్రిలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో సంగారెడ్డి డీఎంహెచ్‌వో వసంతరావ్‌కు విషయం ఫోన్‌లో వివరించారు. సిబ్బంది కొరత ఉంటే డిప్యుటేషన్ చేసిన వారిని తిరిగి ఇక్కడికి పంపించాలని సూచించారు. ఎమ్మెల్యే వచ్చిన విషయాన్ని తెలుసుకుని డ్యూటీలో ఉన్న ఓ ఏఎన్‌ఎం ఆస్పత్రికి రావడం గమనార్హం. ఎమ్మెల్యే వెంట నాయకులు యాదవరెడ్డి, శ్రీనివాస్, స్వప్నశంకరయ్య, క్రిష్ణమూర్తి, జయరాజ్, జమీల్, రవిపటేల్ తదితరులు ఉన్నారు. అలాగే సిర్గాపూర్‌లోని రైతువేదికలో మహిళలకు చీరలను, పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో శారద, ఆర్ఐ మదన్, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తుందని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం వెల్దుర్తిలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4,36,000 విలువ గల చెక్కులను రాజిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు మల్లేశంచారి పాల్గొన్నారు.

వందేమాతరం గీతాలాపన

వటపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతులబోగుడ మోడల్ పాఠశాలలో వందేమాతరం గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్నందున సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : కలెక్టర్

అల్లాదుర్గం/పుల్‌కల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ధ్యేయమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ తదితర మండలాలకు చెందిన మహిళలకు అందిస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం అల్లాదుర్గం మండలం చిల్వర్ ఐబీ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఆర్డీవో రమాదేవి, జడ్పీ సీఈవో ఎల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు చిప్ప శేషారెడ్డి, నిమ్మ రమేష్, దిగంబర్‌రావు పాల్గొన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద మహిళలకు చీరలను ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి సుభాష్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపీడీవో కె.శంకర్, ఎంఈవో అనురాధ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే జహీరాబాద్ మండలంలోని డిడిగి, హుగ్గెల్లి, రంజోల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో, మనూరు మండలంలోని ఐకేపీ కార్యాలయంలో, నాగల్‌గిద్ద మండలంలోని రైతువేదికలో, నారాయణఖేడ్ మండలంలోని పలు గ్రామాల్లో చీరల పంపిణీ జరిగింది.



అల్లాదుర్గంలో చీరలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీవో రమాదేవి

సమన్వయంతో పనిచేయాలి

మెదక్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైందని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో అధికారులకు విధులు, బాధ్యతలు, నియమ నిబంధనలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీపీవో యాదయ్య, డీఈవో విజయ, సైన్స్ అధికారి రాజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలతో మహిళలకు ఉపాధి

వడ్డీలేని రుణాలు మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 1,37,438 మంది స్వయం సహాయక బృందాల్లో అర్హులైన మహిళలకు రూ.8 కోట్ల 80 లక్షల వడ్డీ లేని రుణాల కింద ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. బ్యాంకు లింకేజీపై మహిళల ఖాతాలోకి నేడు మంగళవారం జమకానున్నాయి. అంతకుముందు భవన, ఇతర నిర్మాణ కార్మికులకు బీమా పెంపు పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం : విజయపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ మెదక్ జిల్లా నాయకులు కోణం విఠల్, మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. వారికి విజయపాల్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి క్రిష్ణ, బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



కండువాలు వేసి ఆహ్వానిస్తున్న విజయపాల్‌రెడ్డి

న్యూస్ బాక్స్

యాంటీబయాటిక్స్ మందులు వాడడం ప్రమాదకరం

● హెచ్‌వోడీఎస్ డాక్టర్ శ్రీవిద్య

మెదక్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాంటీబయాటిక్స్ మందులు సొంతంగా వాడడం ప్రమాదకరమని హెచ్‌వోడీఎస్ డాక్టర్ శ్రీవిద్య పేర్కొన్నారు. సోమవారం మెదక్ ప్రభుత్వ కళాశాలలో యాంటీమైక్రోబియల్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో కాస్త దగ్గు వస్తున్నా, గొంతులో ఇబ్బంది అనిపించినా, జ్వరం తగ్గకపోయినా చాలామంది నేరుగా మందుల దుకాణానికి వెళ్లి తమకు తెలిసిన, లేదా షాపు వాళ్లు ఇచ్చిన యాంటీబయాటిక్స్ మందులు కొనుక్కుని వేసుకుంటున్నారన్నారు. దీనివల్ల యాంటీబయాటిక్స్ వివిధ రకాల రోగాలపై పనిచేయడం మానేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రవీంద్రకుమార్, ఫిజియాలజీ హెచ్‌వోడీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా

సంగారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట పెద్దకంజర్ల గ్రామస్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యవర్గసభ్యుడు మాణిక్యం మాట్లాడారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పెద్ద కంజర్లలో సర్వే నెంబరు 120, 121, 125లో రెండెకరాల ప్రభుత్వ భూసేకరణ చేసిందని, ఎకరాలకు రూ.15.70 లక్షలు నష్టపరిహారం ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటివరకు అనేక మంది రైతులకు నష్టపరిహారం అందలేదన్నారు. ఆయా భూముల కబ్జాలకు గురవుతున్నాయని వెంటనే విచారణ చేపట్టి భూమిని కాపాడి, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకుడు నరసింహులు, మాజీ ఎంపీటీసీ జంగయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపనలు ప్రారంభం

నర్సాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ సమీపంలో నిర్మించిన ఆదివరాశక్తి అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపనలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పుణ్యాహవచనం, విఘ్నేశ్వరుని పూజ, వేదస్వస్తి, గోపూజ, ఋత్విజలు, యాగశాల ప్రవేశం తదితర పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్, ఏఎంసీ చైర్మన్‌లు అనసూయఅశోక్‌గౌడ్ దంపతులు, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

నిజాంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రాజేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామశివారులో సోమవారం గొల్ల బిక్షపతి పోల్తీఫాం వద్ద నిల్వ చేసిన ఇసుక డంపును సీజ్ చేశారు.

మూడురోజులుగా వైన్స్‌ల మూత


రామాయంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో మూడురోజులుగా వైన్స్ మార్కెట్లు మూతపడ్డాయి. పట్టణంలో మూడు వైన్స్‌లు, ఒక వైన్స్ మార్ట్ నడుస్తున్నాయి.అయితే పాతవారికి టెండర్లు కలిసి రాలేదు. దీంతో ఇప్పుడు నడుస్తున్న వైన్స్ వ్యాపారులు డీడీలు కట్టడం ఆపేశారు. దీనివల్ల రెండు వైన్స్ షాపుల్లో ఎలాంటి స్టాకు లేదు. స్టాకు తెప్పించకపోవడంతో క్రయ విక్రయాలు ఆగిపోయాయి. వైన్స్‌లు మూతపడడం వల్ల మద్యం ప్రియులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా షాపులు మూసేయిద్దన్నారు.

వరికొయ్యలు కాల్చొద్దు

కల్హేర్/పెద్దశంకరంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యల దహనాన్ని అడ్డుకుని, దానివల్ల కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పించిన సంఘటన కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకయ్యతో పాటు ఇతర రైతులు తమ పొలాల్లో వరి కొయ్యలను కాల్చి యాసంగి పంటకు దుక్కిసిద్ధం చేసుకుంటుండగా నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) నూతన్‌కుమార్, కల్హేర్ ఏవో వెంకటేశం, ఏఈవో క్రిష్ణవేణి గమనించి ఈ చర్యను అడ్డుకున్నారు. వరికొయ్యలు కాల్చుతున్న పొలం వద్దకు వెళ్లి రైతులకు దానివల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పెద్దశంకరంపేట మండల వ్యవసాయాధికారి నాగం కృష్ణ ఆధ్వర్యంలో వరికొయ్యలు కాల్చితే జరిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పించారు.

వెలుగు సభ్యులకే చీరలు.. మేం ఓటర్లం కాదా..?

నిజాంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మేం ఎన్నికల్లో ఓట్లు వేయలేదా.. మాకెందుకు చీరలు ఇవ్వరని తోటి మహిళలు, వృద్ధులు ఆవేదన చెందుతున్నారు. నిజాంపేట మండల పరిధి బచ్చురాజుపల్లిలో సోమవారం ప్రభుత్వం సరఫరా చేసిన చీరల పంపిణీ జరిగింది. దీనిలో వెలుగు గ్రూపులో లేని మహిళలు, వృద్ధులు చీరలకోసం గొడవపడ్డారు. గత ప్రభుత్వంలో అందరికీ సమానంగా చీరలు అందాయి. ఇప్పుడు ఎందుకు వివక్ష చూపిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు అందరూ కావాలి.. ఇప్పుడేమో కొందరికే ప్రభుత్వ పథకాలు అందించడం పట్ల మహిళలు మండిపడ్డారు.



గొడవకు దిగిన మహిళలు

మెదక్ జిల్లాలో సర్పంచ్‌ల రిజర్వేషన్లు

మండలం	ఎస్టీ(మ)	ఎస్టీ(జ)	ఎస్సీ(మ)	ఎస్సీ(జ)	బీసీ(మ)	బీసీ(జ)	జనరల్(మ)	జనరల్	మొత్తం
అల్లాదుర్గం	01	02	01	02	01	02	03	04	16
చేగుంట	01	02	02	02	03	03	06	06	25
చిలప్‌చెడ్	03	03	01	02	01	02	03	04	19
హవేలిఘనపూర్	03	04	02	02	03	03	06	07	30
కౌడిపల్లి	06	06	02	02	03	04	06	06	35
కుల్చారం	01	02	01	02	02	03	05	05	21
మనోహరాబాద్	00	00	01	02	02	03	04	05	17
మాసాయిపేట	01	02	01	02	00	01	03	03	13
మెదక్	01	02	01	02	02	03	05	05	21
నర్సాపూర్	04	05	02	03	03	03	07	08	35
నార్సింగి	01	01	00	01	01	01	02	02	09
నిజాంపేట	01	02	01	01	02	02	03	04	16
పాపన్నపేట	02	03	03	03	05	06	09	09	40
రామాయంపేట	01	02	02	02	01	01	03	04	16
రేగోడ్	01	01	02	02	02	02	04	04	18
పెద్దశంకరంపేట	01	02	02	02	04	04	06	06	27
చిన్నశంకరంపేట	03	03	02	03	03	04	06	07	31
శివంపేట	04	05	02	03	04	04	07	08	37
టేక్మాల్	03	04	02	03	02	03	06	06	29
తూప్రాన్	00	01	01	01	02	02	03	04	14
వెల్దుర్తి	01	01	02	02	03	03	05	06	23
మొత్తం	39	53	33	44	49	59	102	113	492

సంగారెడ్డి జిల్లాలో సర్పంచ్‌ల రిజర్వేషన్లు

మండలం	ఎస్టీ(మ)	ఎస్టీ(జ)	ఎస్సీ(మ)	ఎస్సీ(జ)	బీసీ(మ)	బీసీ(జ)	జనరల్(మ)	జనరల్	మొత్తం
అందోల్	00	01	03	03	03	03	06	06	25
చౌటకూర్	00	01	02	02	01	01	04	04	15
గుమ్మడిదల	00	00	01	01	01	01	02	02	08
హత్నూర	02	02	03	04	04	05	09	09	38
జరాసంఘం	01	01	04	05	03	03	08	08	33
కల్హేర్	02	02	01	01	01	02	03	03	15
కంది	02	02	02	02	02	02	05	05	22
కంగ్టి	03	03	03	03	03	03	07	08	33
కోహీర్	01	01	03	04	01	02	05	06	23
కొండాపూర్	01	02	02	03	02	03	05	06	24
మనూరు	00	01	02	03	02	03	05	06	22
మొగుడంపల్లి	04	05	01	02	01	02	03	04	22
మునిపల్లి	00	00	03	04	04	04	07	08	30
నాగల్‌గిద్ద	06	07	02	03	02	02	05	06	33
నారాయణఖేడ్	08	08	03	04	03	04	08	09	47
నిజాంపేట	04	04	01	01	01	01	03	03	18
న్యాల్‌కల్	00	00	05	05	04	05	09	10	38
పటాన్‌చెరు	00	00	00	01	00	00	01	01	03
పుల్కల్	02	02	02	02	01	02	04	04	19
రాయికోడ్	00	00	03	04	04	05	08	08	32
సదాశివపేట	00	01	03	04	03	04	07	08	30
సంగారెడ్డి	00	01	01	02	00	01	03	03	11
సిర్గాపూర్	05	06	02	02	02	02	04	05	28
వట్‌పల్లి	01	01	02	03	02	03	05	05	22
జహీరాబాద్	03	03	02	02	02	02	04	04	22
మొత్తం	45	54	56	70	52	65	130	141	613